విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 01 మార్చి 2025 | 8 పేజీలు

ప్రభుత్వ భూములు ఆక్రమణలపై
నిఘా ఉంచాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా గట్టి నిఘా పెట్టాలని జిల్లా కలెక్టరు ఎ.తమీమ్ అన్సారియా స్పష్టం చేసారు. శుక్రవారం జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణతో కలిసి మార్కాపురం సౌజన్య ఫంక్షన్ హాల్లో డివిజన్ స్థాయి ప్రత్యేక రెవెన్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని స్పష్టం చేసారు. స్థానిక పరిస్థితులను వీఆర్ఓలు, సర్వేయర్లు నిరంతరం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. అక్రమణకు గురైన ప్రభుత్వ భూములను విడిపించి కబ్జాదారులపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని చెప్పారు. మీ కోసం, రెవెన్యూ సదస్సుల ఆర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలని స్పష్టం చేసారు. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే నిర్వహించాలని, నిబంధనల ప్రకారం ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని చెప్పారు. సర్వే అనంతరం రైతుల నుంచి రసీదు తీసుకోవాలని చెప్పారు. రీసర్వే పురోగతిని ప్రతి రోజు రాను సమీక్షిస్తానని కలెక్టరు చెప్పాడు. ఏమైనా అవకతవకలు ఉన్నట్లు గుర్తిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రౌండ్ ట్రూతింగ్ సమయంలో తహశీల్దార్, సర్వేయర్, వీఆర్ఓ కచ్చితంగా క్షేత్ర స్థాయిలో వుండాలని కలెక్టరు స్పష్టం చేసారు. మ్యుటేషన్ ప్రక్రియకు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, ఆన్ లైన్‌లో ఉన్న వ్యక్తులే ఫీల్డ్ లోనూ ఉన్నారో లేదో సర్వేయర్లు కచ్చితంగా పరిశీలించాలని కలెక్టరు చెప్పారు. ఆ వివరాలు సరిపోలకపోతే తక్షణమే తహశీల్దార్ దృష్టికి తీసుకు వెళ్ళాలన్నారు.

మళ్లీ నిరాశే

- బడ్జెట్‌లో జిల్లాకు దక్కని భరోసా
- వెలిగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు
- దొనకొండ, నిమ్జ్, యూనివర్శిటీలకు కేటాయింపులు
- వ్యవసాయ రంగంపైనా నిర్లక్ష్యం
- కౌలు రైతులకు దక్కని ఊరట
- వామపక్షాల ఆగ్రహం
- సమర్థించిన టీడీపీ, జనసేన
- పశ్చిమ ప్రాంత ఆశలపై నీళ్లు
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టారు. 2025-26 సంవత్సరానికి గాను ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ 3,32,359 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లాను నిరాశ పరిచింది. వెనుకబడిన జిల్లా జాబితాలో ఉన్న ప్రకాశం జిల్లాకు అవసరమైన నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించింది. ప్రకాశం జిల్లా జీవనాడి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు 4 వేల కోట్లకు పైగా అవసరం ఉండగా కేవలం 359 కోట్లు మాత్రమే కేటాయించి జిల్లా ప్రజలను నిరాశకు గురిచేశారు. వెలిగొండను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్న కూటమి ప్రభుత్వ మాటలు కేవలం ప్రకటనకే పరిమితం అయ్యింది. మరోపక్క దొనకొండ కారిడార్, నిమ్జ్, యూనివర్శిటీ మిగతా 2 లో ...

వెనుకబడిన 'ప్రకాశం'కు మొండిచేయి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

కూటమి ప్రభుత్వం తొలి పూర్తిస్థాయి బడ్జట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జట్ అంకెలు ఘనం-కేటాంపులు సంకుచితం అన్న చందంగా ఉన్నది. ప్రాధాన్యాతా రంగాలకు కేటాయింపులు తక్కువ ఉన్నాయి. నీటి పారుదల రంగానికి **18,019**కోట్లు అంకె పెద్దదిగానే కనపడుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యయంతో నిర్మిస్తున్న వెలిగొండకు **359**కోట్లు కేటాంచడం ప్రకాశం జిల్లా ప్రజానీకాన్ని మోసం చేయడమే. రాష్ట్రంలో **4**పారిశ్రామిక వాడల అభివృద్ధి చేస్తామని అందులో దొనకొండకు కూడా స్థానం కల్పించడం ఆశ కల్పించినప్పటికీ ఆచరణ అనుమానమే. ఆర్థిక శాస్త్రవేత్తలు, మేధాలు చెప్పిన కొటేషన్స్‌తో మాటల గారండి చేసినప్పటికి ప్రజలకు అర్థం కాదని కూటమి నేతలు భావిస్తే తెగిన గుణపాతం చవిచూడక తప్పదని హెచ్చరిస్తున్నాం. తక్షణ బడ్జట్‌ను పునఃసమీక్ష చేసి వెలిగొండ ప్రాజక్ట్‌కు నిధులు పెంచేవిధంగా జిల్లా లోని ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. లేనిపక్షంలో జిల్లా ప్రజల ఆగ్రహం చవిచుడవలసి వస్తుంది.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత కల్పించారని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌పై శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదాయం, అప్పులు బేరీజు వేసుకుంటూ ప్రాధాన్యత క్రమంలో పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకు వేసిందని జనార్దన్ రావు తెలిపారు. విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తల్లికి వందనం పథకం అమలుకు బడ్జెట్లో రూ.**9,407** కోట్లు నిధులు కేటాయించడం శుభ పరిణామం అన్నారు.

వైభవంగా బెల్టాగన్-2025 ఉత్సవాలు ప్రారంభం

8లో

అంకెల గారడీగా ఏపీ బడ్జెట్

సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌పై సింగరకొండ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలకు అరకొరగా కేటాయించారన్నారు. మహిళలకు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు నిరుద్యోగ భృతి రూ.3 వేలు, రైతులకు రూ.20 వేలు భరోసాకు పూర్తిస్థాయిలో కేటాయింపులు చేయలేదన్నారు. రాష్ట్రంలో 81 లక్షల మంది విద్యార్థులు ఉండగా రూ.12 వేల కోట్లు అవసరం కాగా రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.

రంజాన్ ఉపవాస వేళల పత్రికను ఆవిష్కరించిన ఎస్పీ

విశాలాంధ్ర - ఒంగోలు : ఎస్పీ కార్యాలయంలో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా గురువారం రంజాన్ ఉపవాస వేళల పత్రికను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మీడియా కెమెరామెన్

అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ ఇఫ్తేఖార్ ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రఫీ జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎం డి యూనస్ ముస్లిం సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు షేక్ రెహమాన్ షేక్ ఖాజా ఖాన్ హనీ షేక్ జిలాని పాల్గొన్నారు.

10 శాతం పైగా పెరిగిన ట్రాఫిక్ జరిమానాలు

ట్రాఫిక్ సీఐ పాండురంగారావు

విశాలాంధ్ర -ఒంగోలు : నేటి నుండి కేంద్ర మోటార్ వెహికల్ చట్టం అమలులోకి రానుంది. కొత్త చట్ట నిబంధన మేరకు ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు గతంలో కన్నా పది రెట్లు అధికంగా ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించనున్నారు. ఇప్పటివరకు హెల్మెట్ లేని వారికి రూ. 135 ఫైన్ వేస్తుంటే మార్చి 1వ తేదీ నుండి అది పదింతలు పెరిగి రూ. వెయ్యి రూపాయలు జరిమాన వేణు ఉన్నారు. అన్ని రకాల చలానాలు పెరిగాయి. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు వాహనం నడిపే వారితో పాటుగా, వెనుక ఉన్న వాళ్ళకి కూడా రూ.వెయ్యి రూపాయలు జరిమానా విధించనున్నారు. అదేవిధంగా లైసెన్స్ లేని వాహనదారులకు రూ. 5000 జరిమానా విధించనున్నారు. ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు లేని వాహనదారులకు మొదటిసారి రూ. 2000 జరిమానా రెండవసారి రూ. నాలుగు వేల వరకు జరిమానా విధించనున్నారు. అలాగే పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని, అధిక శబ్దం చేసే వాహనాలకు రూ. 1500 వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రమాదకరమైన డ్రైవింగుకు, సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారికి మొదటిసారి రూ. 1500 జగమాన విధిస్తుండగా రెండవసారి పట్టుబడిన వారికి రూ. పదివేల వరకు జరిమానా విధించనున్నారు. యూనిఫామ్ లేని డ్రైవర్లకు, సరైన పత్రాలు లేని డ్రైవర్లకు మొదటిసారి రూ. 150 జరిమానా విధిస్తుండగా రెండవసారి పట్టుబడి వారికి రూ. 300 పేరా జరిమానా విధిస్తున్నారు. సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడిపే వారికి, అలాగే వారి పక్కనున్న వారికి కూడా రూ.వెయ్యి రూపాయల వంతున జరిమానా విధించనున్నారు రిజిస్ట్రేషన్ లేని వాహనాలకు, సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని వాహనాలకు, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలకు మొదటిసారిగా జరిమానా రూ. 2000, రెండవసారి పట్టుబడితే రూ.5000 జరిమానా విధించనున్నారు.

సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట

-ఒంగోలు ఎంపీ మాగుంట

రాష్ట్ర శాసనసభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెటులో సంక్షేమానికి మరియు అభివృద్ధికి పెద్ద పీటవేశారని ఎంపీ మాగుంట శ్రీనివాసులు అన్నారు. వ్యవసాయ రంగానికి రూ.48,341 కోట్లతో ప్రత్యేక బడ్జెటుతో పాటు మిగతా రంగాలకు కూడా బడ్జెటులో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన అపూర్వమైన తీర్పుకనుగుణంగా బడ్జెటు రూపొందించడం ప్రశంసనీయం. వైద్య-ఆరోగ్యానికి రూ.19,264 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు, పరిశ్రమలకు రూ. 3,156 కోట్లు, ఇంధన రంగానికి రూ.13,600 కోట్లు, రోడ్లు భవనాలకు రూ. 8,785 కోట్లు, యువజన శాఖకు రూ.469 కోట్లు, ఎస్.సి. లకు రూ.20,281 కోట్లు, ఎస్.టి. లకు రూ. 8,159 కోట్లు, బి.సి. లకు రూ.47,456 కోట్లు, మైనారిటీలకు రూ.5,434 కోట్లు, మహిళ శిశు సంక్షేమానికి రూ.4,332 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.18,847 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.13,862 కోట్లు, గృహనిర్మాణానికి రూ. 8,570 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి రూ. 1,228 కోట్లు, పౌర సరఫరాలకు 3,806 కోట్లు, తల్లికి వందనానికి రూ.9,407 కోట్లు ఇచ్చారన్నారు.

హామీల అమలుకు అధిక ప్రాధాన్యం

- నూకసాని బాలాజీ

అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లిడాక్టర్ నూకసానిబాలాజీ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా బడ్జెట్ను అద్భుతంగా రూపొంది చిందన్నారు. బడ్జెట్లో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఎన్నికల మేనిఫెస్టో హామీల అమలుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్లకు బడ్జెట్లో నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా బడ్జెట్లో కేటా యింపులు చేశారని తెలిపారు. పర్యాటకం, క్రీడలు మరియు సంస్కృతి అభివృద్ధికి బడ్జెట్లో సముచిత ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

మళ్లీ నిరాశే

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుతో పాటు ఫ్లోరైడ్ సమస్య పరిష్కారంతో పాటు గుండ్లకమ్మ, సంఘమేశ్వరం, పాలేటిపల్లి మొదలైన సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరగకపోవడంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 3లక్షల 22 వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీగా ఉంది తప్ప ఈ బడ్జెట్ వలన పేద, బడుగు, బలహీన, రైతు, కౌలు రైతులు, సంక్షేమానికి ఏమాత్రం ప్రయోజనకరంగా లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ధ్వజమెత్తారు. దేశంలో గొప్పగా బడ్జెట్ను ప్రవేశపెట్టారని చెప్పుకోవడానికే తప్ప ఈ బడ్జెట్ వలన వెనుకబడిన జిల్లాకు ఏ మాత్రం ప్రయోజకరంగా లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలకు నిధులు ఎక్కడా అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం లాంటి పథకాలకు నిధుల కేటాయింపులు పూర్తిస్థాయిలో ఉన్నాయా అని ఎంఎల్ నారాయణ ప్రశ్నించారు. రెవెన్యూ వ్యయం, ఆర్థిక లోటుకు ఎక్కడా పొంతన లేకుండా బడ్జెట్ కేటాయింపు జరిగింది. మరోపక్క రైతులు గిట్టుబాటు ధర లేక రోడ్లు ఎక్కి ఆందోళన చేస్తున్నారు. కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బడ్జెట్లో వ్యవసాయ రంగానికి సంబంధించి కౌలు రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిధులు కేటాయింపు జరగలేదు. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో ఉన్న వెలుగొండ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్లోనైనా కనీసం 2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు కోరారు. ఇటీవల కాలంలో ఇరిగేషన్ శాఖ మంత్రి పర్యటించి బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి చివరకు అరకొర నిధులు కేటాయించారు. ఫలితంగా వెలుగొండ ప్రాజెక్టు మరో ఐదు సంవత్సరాలు పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. జిల్లాలో అసంతృప్తిగా ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణానికి మంచి నీటి సమస్య పరిష్కారానికి ఎక్కడా కేటాయింపులు జరగలేదు. మరోపక్క ప్రకాశం జిల్లాలో విమానాశ్రయంకు సంబంధించి భూముల సర్వే జరుగుతున్నా బడ్జెట్లో విమానాశ్రయం ఊసే కన్పించలేదు. ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు ఊసే లేదు. పర్యాటక రంగానికి తగిన నిధులు బడ్జెట్లో కన్పించడం లేదు. కొత్తపట్నంలో హార్బర్ ఏర్పాటు చేస్తామని చెప్పినా బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం జిల్లా ప్రజలను మరింత నిరాశ పరిచింది. ఇలా వెనుకబడిన ప్రకాశం జిల్లాకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు జరగకపోవడంతో జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలపై కూడా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉంటే అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకులు బడ్జెట్పై ప్రశంసలు కురిపించడం ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి తోడుగా జనసేన, బీజేపీ నాయకులు కూడా బడ్జెట్పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, సీపీఎం ఎంఎల్, న్యూ డెమక్రసీ తదితర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు బడ్జెట్లో జిల్లాకు తగిన నిధులు కేటాయింపు జరగకపోవడం పట్ల బడ్జెట్పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభిప్రాయాలు వారి మాటల్లోనే :

ఇది దగా కోరు! దివాల కోరు బడ్జెట్.!

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా

కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి తొలి బడ్జెట్ దగా కోరు, దివాలా కోరు బడ్జెట్ అని, సంక్షేమ బడ్జెట్ కాదు సంక్షోభ బడ్జెట్అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల వ్యతిరేక బడ్జెట్ సంఖ్య ఘనం - కేటాయింపులు శూన్యం. - అంతా అంకెల గారడి - అభూత కల్పన. దశ - దిశ లేని.. పస లేని బడ్జెట్ ఇది, రాష్ట్రం గుల్ల.. బడ్జెట్ అంతా డొల్ల. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ఇతర హామీలకు ఎగనామం పెట్టారని వెనుకబడిన ప్రకాశం జిల్లా కు బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తీవ్రంగా విమర్శించారు. ఇది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని తొలి బడ్జెట్తోనే నిరూపితం అయ్యిందని,సూపర్ సిక్స్ పథకం కాస్త సూపర్ ఫ్లాప్. అయిందని, అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడం అరకొరనేఅని, పీఎం కిసాన్ పథకం నుండి సంవత్సరానికి 6000తో కలిపి 20,000 ఇస్తామని మాట తప్పారన్నారు.

పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం

- చిట్టి పాటి వెంకటేశ్వర్లు

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం 3,22,859కోట్ల బడ్జెట్ ను 2025-26 సంవత్సరానికి ప్రవేశ పెట్టింది. ఈ బడ్జెట్లో ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం తరపున చంద్రబాబు ఇచ్చిన హామీలు , దీపం పథకం, ఉచిత బస్సు ప్రయాణం, మహిళల సంక్షేమం, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, తల్లి వందనం తదితర పథకాలకు ఎటువంటి కేటాయింపులు లేవు అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టి పాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులు పండించిన పంటలకు ధరల స్థిరీకరణ నిధికి 3000 కోట్ల రూపాయలు కేటాయించాల్సింది ఉండగా,300 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. అన్నదాత సుఖీభవ,పీఎం కిషాన్ పథకానికి 13,500 కోట్ల రూపాయలు అవసరం ఉండగా 6, 300 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. వైద్య,విద్యారంగానికి 6శాతం శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.5% నిధులు మాత్రమే కేటాయించారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగునీరు తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టుకు 4,000 కోట్ల రూపాయలు అవసరం ఉండగా, ఈ బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలు కేటాయించాలని వెలుగొండ ప్రాజెక్టు ప్రాంత ప్రజలు డిమాండ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం విస్మరించి 359 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది..వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్అర్ ప్యాకేజీ కింద 1000 కోట్ల అవసరం ఉండగా 116 కోట్ల మాత్రమే కేటాయించారన్నారు.

వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధిపై నిర్లక్ష్యం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మాబు



వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి యస్.కె. మాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయడానికి 4 వేల కోట్లు అవసరమౌతాయని ప్రాజెక్టును ఇటీవల సందర్శించిన నీటిపారుదల శాఖ మంత్రి ప్రకటించారు. బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి 2027 నాటికి ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు. తీరా నేడు బడ్జెట్లో నిధులు నామమాత్రంగా కేటాయించారు. ఈతీరున కేటాయింపులతో ప్రాజెక్టు ఎప్పటికి పూర్తిఅవుతోందో అని జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పరిశీలించి బడ్జెట్లో సవరణలు చేసి వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని గుండ్లకమ్మ, సంగమేశ్వరం, పాలేటిపల్లి, మొదలైన ప్రాజెక్టుల పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలి. జిల్లాకు చెందిన దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్ ప్రాంతంలో మౌళిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలి.

అభివృద్ధిని ప్రోత్సహించేలా బడ్జెట్

బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గెమ్ శ్రీనివాసరావు



రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గెమ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బడ్జెట్ బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి అనుగుణంగా ఉందన్నారు. మాజీ బిజెపి జిల్లా అధ్యక్షులు టీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ వ్యవసాయానికి పెద్ద పీటవేయటం సంతోషదాయకమన్నారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సమతుల్యంగా ఉందని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి రాయితీలు కల్పించడం మంచి పరిణామం అన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

- సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వాళ్ళు ప్రకటించుకున్నట్లుగా 2047 సంవత్సరానికి పేదరిక నిర్మూలనగా 15శాతం అభివృద్ధి లక్ష్యంగా ప్రకటించుకున్నారని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు తెలిపారు. మొత్తం బడ్జెట్ మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయల బడ్జెట్లో వ్యవసాయానికి అనుబంధ రంగాలకు 13,4 87 వేల కోట్ల రూపాయలు కేటాయించడమంటే రాష్ట్రంలోనే వ్యవసాయానికి ప్రాజెక్టుల పూర్తికి సరిపడవు. ధరల స్థిరీకరణకు మేధావులు రైతు సంఘాలు అందరూ ముక్తకంఠంతో మూడు వేల కోట్ల రూపాయలు నిధి కేటాయించమని డిమాండ్ చేస్తే కేవలం 300 కోట్ల రూపాయల కేటాయించడం రైతాంగాన్ని మార్కెట్ మాయాజాలంలో ముంచడమే. ఎస్సీ ఎస్టీ బీసీ అల్పసంఖ్యాక వర్గాలకు కేటాయింపులు చూస్తే పెరుగుతున్న ధరలకు గత కేటాయింపులకు ఎటువంటి పొంతన లేదు. అంకెల గారడీ తప్పితే ప్రజల సంక్షేమం అభివృద్ధి నిర్లక్ష్యం చేయబడుతుంది. భవిష్యత్తులో ప్రజలపై మరింత పన్నుల భారం మోపడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. నిరుద్యోగ సమస్యకు ఎటువంటి పరిష్కారం చూపలేదు గత ఎన్నికల వాగ్దానం గత ఎన్నికల వాగ్దానం వాలంటరీ వ్యవస్థ పై ఎటువంటి నిర్ణయము లేదు విద్య వైద్య రంగా కేటాయింపులు చూస్తే అల్పమైనవి అన్నారు.

ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా సైన్స్ డే

విశాలాంధ్ర-మార్కాపురం : భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సివి రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును పురస్కరించుకుని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సైన్స్ 'డే' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బిగ్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎంతో ప్రఖ్యాతి గాంచిన సివి రామన్ భౌతిక శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు, విజయాలు నేటితరం సైన్స్ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భారత జాతి నిర్మాతల్లో సగర్వంగా శాశ్వతంగా నిలిచిపోయే అసాధారణ మేధావుల్లో సివి రామన్ ఒకరు అని ఆయన గుర్తు చేశారు. 1949 లో బెంగుళూరు లో రామన్ సైన్స్ ఇన్స్టిట్యూట్ను స్థాపించి తుదిశ్వాస వరకు పరిశోధనలోనే నిమగ్నమైన విజ్ఞాన ఖని సివి రామన్ అని డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ అన్నారు. సివి రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మీర్జా మహమ్మద్ మసూద్ అలీ బేగ్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి హెచ్ శ్రీధర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభావంతులుగా గుర్తింపు : డీఈవో

విశాలాంధ్ర-ముండ్లమూరు : విద్యార్థులు ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకునేందుకు పట్టుదలతో రాణించాలంటే ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సైన్సు దినోత్సవ సందర్భంగా సైన్స్ పితామహులైన సివి రామన్, లూయీ పాశ్చర్, రూథర్ ఫోర్డ్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధతో రాణించాలని సూచించారు. సామాజిక పురోభివృద్ధికి తోడ్పాటు అవుతుందని అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శ నలతో విద్యార్థు లకు సైన్స్ పై ఆసక్తి పెరుగుతుంది అన్నారు. ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతరంగా బోధిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు 50 పైగా వివిధ రకాల వస్తువులు, బొమ్మలు, తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చాంద్ బాషా, జానకి రామయ్య, సాదు వెంకటేశ్వర్ రెడ్డి, సుబ్బారావు, యమలేశ్వర చారి, హరిబాబు, ఏంజిలీనా గ్రేస్ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హోవే జయంతి పురస్కరించుకొని మండల కేంద్రమైన గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలను టైలర్స్ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు టైలర్స్ ఘనంగా నిర్వహించారు. ముందుగా విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ విలియం హోవే అంటూ నినాదాలు చేశారు. మండల టైలర్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మునగపాటి వెంకట చెన్నారావు, చెరెడ్డి కొండారెడ్డి, సెక్రెటరీ రమణయ్యలు మాట్లాడుతూ, టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అర్హులైన టైలర్స్ అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. .తొలుత టైలర్స్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ సంఘం జాయింట్ సెక్రెటరీ దోల అవయ్య,ట్రెజరర్ పాలూరి ఎలమంద, గౌరవాధ్యక్షులు రాఘవయ్య, పిల్లి చిన్న, వీరయ్య, కాశి ,అంబటి శ్రీను పలు గ్రామాల టైలర్స్ పాల్గొన్నారు.

టీడీపీ నేత రోశయ్య మృతి

సంతాపం తెలిపిన టీడీపీ, వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గనివానిపాడు గ్రామ మాజీ సర్పంచి టిడిపి నాయకుడుమువ్వా రోశయ్య82 శుక్రవారం మృతి చెందారు. ఆయన అనారోగ్యంతో ఉండి ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తు మృతి చెందినట్లు బంధువులు. తెలిపారు .రోశయ్య 1989 నుంచి 92 వరకు సర్పంచిగా సేవలందించారు. ఈయనకు ముగ్గురు కొడుకులు ఒక కుమార్తె ఉన్నారు. రోశయ్య మరణ వార్త తెలుసుకున్న మండల టిడిపి అధ్యక్షుడు మోరపోయిన బాబురావు, టిడిపి నాయకులు తాటిరెడ్డి వెంకటరెడ్డి, కనకం నరసింహారావు, చిన్నారి కట్ల సాగునీటి సంఘంఅధ్యక్షులు దేవి రెడ్డి శ్రీనివాసులరెడ్డిలు రోశయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ పిసిసి మెంబర్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మంచికల జోసెఫ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వైసిపి నాయకుడు మంచికల చిన్న కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు మంచి కల పెద్ద కోటేశ్వరరావు, ఉన్న గురువాయపాలెం పశు వైద్యాధికారి మంచి కల మణి శేఖర్ శేఖర్, వాగుమడుగు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలయ్య చిరుగురి ఆదామ్ పలువురు నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

'లక్ష్మీనారాయణ' మృతికి 'దద్దాల' సంతాపం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని జిల్లెలపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడం లక్ష్మీనారాయణ గురువారం రాత్రి సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. వారి మృతికి నివాళులర్పిస్తున్న కనిగిరి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, వైఎస్ఆర్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి శుక్రవారం ఆయన స్వగ్రామం వెళ్లి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పారు. వైసీపీ కలిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, జడ్పిటిసి గుంటక తిరపతిరెడ్డి మాట్లాడుతూ మేడం లక్ష్మీనారాయణ రెడ్డి కుటుంబానికి వైయస్సార్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు మేడం లక్ష్మీనారాయణ రెడ్డి మృతి వైఎస్ఆర్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల మండల వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి,కనిగిరి మండలం అధ్యక్షులు జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాంధ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచులు తాతపూడి సురేష్ బాబు, శ్యామల కృష్ణారెడ్డి, చిలకల నారాయణరెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్లు, మేడం ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు రమణయ్య, కుప్పనబోయిన వెంకటరామయ్య, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పల్నాటి భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు గూడూరి అనిల్, ఆవుల తిరుపతిరెడ్డి, కత్తెర వెంకటేశ్వర్లు, కసిరెడ్డి శ్రీను, శ్రీరాములు, ఈర్ల శ్రీను పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కాపురం రైల్వే స్టేషన్ రోడ్ నందు ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులు పలు ఆకర్షణీయమైన సైన్స్ పరికరాలను తయారు చేయడం జరిగింది. వాటిని ఉపాధ్యాయులకు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అఖిల మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడమే కాకుండా వారి భవిష్యత్తుకు సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : మొట్ట మొదటి భారతీయ నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్. రామన్ ఎఫెక్ట్ కనుగొనిన దినోత్సవం సందర్భంగా జరుపుకునే జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల వేదికగా ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సైన్స్ ఆవిష్కరణలకు మూలం మానవ సమాజం సౌకర్యవంతమైన వసతులు, వనరుల అభివృద్ధి సంరక్షణ తదితర అంశాలపై నూతన ఆవిష్కరణలు లేత మనస్సులో నాటిన ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు నాంది అని నేటి విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలు అని అలాంటి సృజనాత్మక ఆలోచనలు పాఠశాల స్థాయిలో అంకురార్పణ జరగాలని కేవలం రెండు వందల రూపాయల ఖర్చుతో చేసిన ఆవిష్కరణ శాస్త్రరంగాల్లో గొప్ప మార్పుకు కారణం అయిందని అట్టి ఆలోచనలు సమాజ స్థితి గతిలో ప్రగతి శీల మార్పులకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం అలవడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్ ఫో వారిలో దాగిన అంతర్గత సృజనకు అద్దంపట్టింది. విద్యార్థులు ఆసక్తికరంగా ఆయా ఎగ్జిబిట్స్ ను తిలకించారు. జడ్జీలు బహుమతులకు అర్హతగల ప్రాజెక్టులకు ఎంపిక చేసి ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగపు ఉపాధ్యాయులు యస్ బాస్కర్ రెడ్డి యం.మల్లికార్జున, ఎ.శివకృష్ణ, డి.ఎలిజబెత్ రాణి, టి.రామకృష్ణ, పి.వెంకటేశ్వర్లు, డి.రామారావు, పి.అల్లూరయ్య, ఎ.శ్యామ్ సుభాకర్, యన్.వెంకటేశ్వర్లు, పి.ప్రభాకర్ రెడ్డి, బి.రత్నరాజు తదితర ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను ఆర్డీఓ పరిశీలన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు పంచాయతీలో గల అశ్వరాయనిపాలెం గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్నిశుక్రవారం కనిగిరి ఆర్డీవో కేశవదన్ రెడ్డి పరిశీలించారు. భూముల రీ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు, అంతేకాకుండా సర్వే చేసే ముందు రైతులకు సమాచారం ఇచ్చి వారి ఎదురుగా రీ సర్వేను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మీకేమైనా సమస్యలుంటే తెలియజేయాలనగా వారు సాగులో ఉన్న మా భూములు కొన్ని ఆన్లైన్లో నమోదు కాలేదని వాటిని సవరించాలని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డీవో పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మండల డిప్యూటీ సర్వే రాజశేఖర్, గ్రామ సర్వే పిల్లి శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు నర్సిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శనివారం 01 । మార్చి । 2025

టీడీపీకి అత్యధిక సభ్యత్వాలు

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్రములో అత్యధిక సభ్యత్వంలతో ముందుకు పోతున్నదని మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల టిడిపి కార్యాలయంలో ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను మండలంలోని పార్టీ నాయకులకు, లాంచనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి లేని కార్యకర్తల మద్దతు తెలుగుదేశం పార్టీకి ఉన్నదనన్నారు. ప్రమాదవశాత్తు కార్యకర్తకు జరగరానిది జరిగితే, ఐదు లక్షల బీమా సౌకర్యం ఉందని ఆయన తెలిపారు, కార్యకర్తల బిడ్డలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నాణ్యమైన విద్య నిరంతరాయంగా అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబులకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్ల నరసింహారావు చౌదరి, పందిటి హరీష్, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, షేక్ కాజా రహమతుల్లా, టీవీకే సుబ్బారావు, నచ్చుపాడ మాజీ సర్పంచ్ మల్లె బోయిన గురుబ్రహ్మం, మల్లెబోయిన బాల బ్రహ్మయ్య, ఆవుల రమణమ్మ, మద్దిశెట్టి రమాదేవి బండ్ల నారాయణ, గోళ్ళ వీరబాబు, పత్తు మస్తాన్, బద్దిపూడి మార్కు, గుత్తి మహేష్ పాల్గొన్నారు.

బీవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర -చీమకుర్తి : చీమకుర్తిలోని బి.వి. ఎస్.ఆర్.ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ కార్యక్రమంలో వెంకాయమ్మ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ బూచేపల్లి సుబ్బారెడ్డి వెంకాయమ్మ కాలేజీలో ప్రారంభించడం తనకు ఎంత ఆనందంగా ఉందని అన్నారు. కాలేజీ ప్రిన్సిపల్,స్టాఫ్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమ గుర్తులు అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమకుర్తి టైలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పఠాన్ అశ్విల్లి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ ర్యాలీ చీమకుర్తి పట్టణ విధులను నిర్వహించారు. తదుపరి స్థానిక బస్టాండ్ సెంటర్ నందు ఖైలాస్ జర్నన్ ఆవిష్కరించారు ఆంధ్ర కుట్టుమిషన్ సృష్టికర్త ఏలియాస్ హావే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోపవరము శ్రీనివాసరావు, తాటికొండ బాలు, గుండా శివ, పెదబాబు, నూకల శ్రీనివాసరావు, శ్రీరాములు, చీమకుర్తిలోని టైలర్స్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలములోని బొట్లగూడూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం బొట్లగూడ గ్రామంలో బోరు బావి తవడానికి పైపులు బాలాజీ నాయక్ అనే వ్యక్తి బోరు బావి తవడానికి పైపులు బిగిస్తుండగా పైన ఉన్న 33 కెవి లైన్ తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. బాలాజీ నాయక్ స్థానిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూర్ వైద్యశాలకు తరలించారు.

పశు వైద్య విద్యార్థులకు ఉపకారవేతనం పెంచాలి

ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కనిగిరి ఆర్టీవోకు అర్జీ అందజేత

విశాలాంధ్ర - కనిగిరి: ఫిబ్రవరి 3వ తారీకు నుండి శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం క్లాసులు బహిష్కరించి చేస్తున్న సమ్మెను విరమింప చేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరి ఆర్టీవో ఆఫీస్ నందు డీఏఓ బాలాజీకి అర్జీ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యాలయ అనుబంధ కాలేజీలైన తిరుపతి, పొద్దుటూరు, గన్నవరం, గరివిడి విద్యార్థులు ఫిబ్రవరి 3వ తారీకు నుండి క్లాసులను బహిష్కరించి సమ్మెను నిర్వహిస్తూ రిలే దీక్షలు చేపట్టడం జరిగింది. తిరుపతిలోని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, తిరుపతిలోని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ లను స్వయంగా కలిసి విన్నవించడం జరిగింది. ప్రభుత్వం ఇంతవరకు వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. పశువైద్య విద్యార్థులకు ఇంటర్న్ షిప్ చేసే సమయంలో వారికి ఇచ్చే స్టైఫండ్ 2013 నుండి 7,000 రూపాయల నుండి రూ. 12,000 వరకు మాత్రమే గవర్నమెంట్ స్టైఫండ్ అందిస్తుందన్నారు. అదే జనరల్ వైద్యవిద్యను చదివే విద్యార్థులకు స్టైఫండ్ 25 వేల రూపాయల నుండి 65,000 వేల వరకు స్టైఫండ్ అందిస్తుందని పశు వైద్య విద్యార్థులకు కూడా జనరల్ వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ అందించాలని ఆయన అన్నారు. గ్రామాలలోని ప్రజలు ఎక్కువ శాతం పశువుల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తుంటారని. అంతేకాక దేశానికి వెన్నుముకలాంటి రైతులు పెంచే పశువులకు వచ్చే వ్యాధుల నుండి పశువులను కాపాడుతూ పశుసంపద అభివృద్ధికి తోడ్పడుతున్న భవిష్యత్తు పశు వైద్యుల పట్ల ప్రభుత్వము నిర్లక్ష్యం వీడనాడాలని, సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జనరల్ మెడిసిన్ చదివే విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైఫండ్ తో సమానంగా పశు వైద్య విద్యార్థులకు కూడా అందించాలని. గత సంవత్సరం నవంబర్ డిసెంబర్ నెల నుండి బకాయిల స్టైఫండ్ ఏదైతే ఉందో వాటిని వెంటనే చెల్లించాలని. రాష్ట్రవ్యాప్తంగా పశు వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను, అలాగే పసుపు వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని. రూరల్ లైఫ్ స్టాక్ యూనిట్లను అప్ గ్రేట్ చేసి పశు వైద్యులను నియమించాలని పశు వైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న సమ్మెకు ఏఐవైఎఫ్ మద్దతుగా నిలుస్తుందని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతల ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా సుబ్బారావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మాచపల్లి పూర్ణ చంద్ర రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కుమార్, పట్టణ కార్యదర్శి గూడూరి సురేష్, ఏఐటీయూసీ నాయకులు ఖాసింపీరా పాల్గొనడం జరిగింది.

అన్యాక్రాంతమవుతున్న ఫారెస్ట్ భూములను గిరిజనులకు పంపిణీ చేయాలి

జీపీ రామారావు

విశాలాంధ్ర-పిసీపల్లి : పెదచెర్లోపల్లి మండల పరిధిలో గుంటుపల్లి రెవెన్యూలో అన్యాక్రాంతమవుతున్న అటవీ భూములను గిరిజనులకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి పి రామారావు తెలిపారు. గుంటుపల్లి రెవెన్యూలో సర్వేనెంబర్ 5/1 లో 2,304 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ కు సంబంధించిన భూమిని కొంతమంది ల్యాండ్ మాఫియా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అన్యాక్రాంతం చేస్తూ ఫారెస్ట్ భూములను కొల్లగొడుతున్నారని ప్రభుత్వ అటవీ బంజర భూములను కాపాడవలసిన అధికారులు పెద్దలకు వేల ఎకరాలను భూములను కట్టబెడుతున్నారని అధికారులకు ఏమీ తెలియనట్టుగా ముడుపులు అందుకుంటూ ల్యాండ్ మాఫియాకు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు గుంటుపల్లి సర్వే నెంబరు 5/1 లో జరుగుతున్న పనులను వెంటనే ఆపాలని ఫారెస్ట్ ల్యాండ్ ను గిరిజనుల హక్కుల చట్టం చెట్టుపట్టా ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయిలో కలెక్టరేటను ముట్టడిస్తామని వారు ప్రకటనలో తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం పేదలకు పిరికెడు అన్నం పెట్టాలనేఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రవేశ పెట్టిన కిలో రెండు రూపాయలు బియ్యం పథకం రేషన్ షాపు డీలర్లకు వరంగా మారింది. మండలంలో 31 రేషన్ షాపులు ఉండగా 29 రేషన్ షాపులలో ఎండి యు వాహనాల ద్వారా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ బియ్యం పంపిణీ చేయడం జరుగు తుంది. అయితే ప్రభుత్వ పథకానికి విరుద్ధంగా ముండ్లమూరు, పెద రావిపాడు గ్రామాలలో బియ్యం పంపిణీ చేయడం లేదని గ్రామాల్లోని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ బియ్యం అవినీతి అక్రమాలపై ముళ్ళమూరు గ్రామానికి చెందిన బొల్లేపల్లి లింగమూర్తి స్థానిక తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. డీలర్ల అక్రమ బియ్యం వ్యాపారం ఏదేచ్ఛగా జరుగుతున్న దని దీనిపై చర్యలు తీసుకోవాలని లేనిచో జిల్లా కలెక్టర్ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రికి తెలియజేస్తానని బొల్లేపల్లి లింగమూర్తి తెలిపాడు.

పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజల సుఖ సంతోషాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణయే ప్రధాన ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని, ఇందు కోసం యువతీ యువకుల శక్తి వంచన లేకుండా పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా యువజన సర్వీసులు - క్రీడా విభాగం మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల పెంపకాన్ని, పారిశుధ్య పనుల నిర్వహణను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ముందుకు వెళ్లాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను మనం నాటినట్లయితే అవి మన ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ప్రాణ వాయువును అందించడమే కాకుండా మానవాళి మనుగడకు ఎంతగానో ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. ప్రధాన రహదారుల ప్రక్కన ఉన్న పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్.ఎస్.ఎస్. విభాగం హైదరాబాదు కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు ఎన్. శ్యేదా నాయక్ ఒంగోలు నగరంలోని పలు కళాశాలలకు చెందిన ఎస్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్లు టి. రాజేంద్ర బాబు, కె.రవి తేజ, పి.నీలిమ, కె.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వం ఇంటర్‌మీడియట్ పరీక్షలు నేటి నుండి ప్రారంభమవుతున్నాయి. పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పరీక్ష కేంద్రంకు మూడు కళాశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతారని పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి జి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని నాగులపాలెంలోగల డా.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, నూతలపాడు కళాశాల, పర్చూరు కళాశాల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మార్చి 15 వరకు పరీక్షలు ఉంటాయని, ఉదయం 9 నుండి 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు ఉండరాదని తెలిపారు. డిపార్టుమెంట్ అధికారిగా సునీత విధులు నిర్వహిస్తారని సీఎస్ రవికుమార్ తెలిపారు.

చెరుకూరులో రైతుల సమావేశం

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని చెరుకూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 2వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు రైతులతో సమావేశం జరుగుతుందని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజామోహనరావు తెలిపారు. పొగాకు, మర్చి రైతులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - అద్దంకి : పట్టణంలోని కట్టకిందపాలెంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది.కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి శాస్త్రీయ దృక్పథంను అలవాటు చేసుకోవాలన్నారు.పాఠశాల విద్యార్థులు సొంతంగా తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు.కార్యక్రమంలో హెచ్ఎం ఎంవి సుబ్బారావు,ఎస్ఎంసి చైర్మన్ రవి,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి

విశాలాంధ్ర - అద్దంకి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు నూరు రోజులు పని కల్పించాలని ఉపాధి హామీ పథకం పీడీ విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు.శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అద్దంకి,కొరిశపాడు మండలాలలో జరుగుతున్న ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.పిడి మాట్లాడుతూ సగటు వేతనం 300 వచ్చేలా కూలీలను చైతన్య పరచాలన్నారు.లక్ష్యం మేరకు గ్రామాలలో ఫారం పాండ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.ప్రతి పంచాయతీలో కనీసం 10 పారం పాండ్ల నిర్మాణం జరగాలన్నారు.అర్హులైన రైతులకు నూరుశాతం సబ్సిడీతో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో సింగయ్య,ఏపీవోలు,ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన దాసరి మురళీకృష్ణను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద అమ్మకానికి ఉంచిన 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ భవాని తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అద్దంకి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా,విక్రయాలు జరిపిన సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గన్నవరంలో రూ.18 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు చొరవతో మండల టీడీపీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి ఆధ్వర్యంలో రూ.18 లక్షల నిధులతో గన్నవరం గ్రామంలో మూడు సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.గన్నవరం గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తున్నది. గ్రామంలో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రెండు బజార్లు మినహా అన్ని బజార్లు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయగా,మిగిలి ఉన్న రెండు బజార్లు సిసి రోడ్ల నిర్మాణం ఇప్పుడు పూర్తి చేశారు.రెండు రోడ్లతో పాటు చెరువు కట్ట వద్ద మర్రిచెట్టు వద్ద నుండి మంచినీటి ట్యాంకులు,నీళ్ల బావులు వరకు సిమెంట్ రోడ్డు, ప్రభుత్వ సహకారంతో ఎమ్మెల్యే ఏలూరి తోడ్పాటుతో మరో రూ.18 లక్షల నిధులతో రెండో విడత సిమెంట్ రోడ్డు నిర్మాణాని పూర్తి చేశారు.ఈ సందర్భంగా రంగయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు, అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారని, దానికి తోడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నారని,గ్రామాభివృద్ధి శ్రీకారం చుట్టారని అన్నారు.మా గ్రామంలో సిమెంటు రోడ్లతో పాటు పొలాల లింకు రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలతో పాటు,స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ గన్నవరం కార్యక్రమాన్ని, గ్రామంలో సైడ్ కాలువల మరమ్మ తులతో పాటు,పూడు తీయించే కార్య క్రమం శుభ్రత పరిశుభ్రత చేపట్టి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయిన చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో రుణ సౌకర్యం పొందేందుకు లబ్దిదా రులు ఎంపిక చేసి మంజూరు నిమి త్తం పంపడం జరిగిందని,అలాగే ఇంకా అనేక పథకాలకు ప్రతిపాదనలు పంపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు తోడ్పాటుతో గ్రామంలో జడ్పీటీసీ చుండి నారాయణమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు ధూళి పాళ్ల కుమారస్వామి, దేవసహాయరావు, సోమేపల్లి బాబు, సోమేపల్లి నరసింహారావు,ప్రత్తిపాటి రాజేష్, వేణులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర-పర్చూరు: భూసమస్యల పరిష్కారినికే రీసర్వే జరుగుతుందని బాపట్ల కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండలంలోని రమణాయపాలెంలో జరుగుతున్న భూముల రీసర్వేను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే సమయంలో ప్రతి రైతుకు సమాచారాన్ని అందించాలని, గ్రామ సభలు, మైక్‌ల ద్వారా సమాచారాన్ని ఆయా గ్రామాల్లో తెలపాలని సూచించారు. రీసర్వే సమయంలో సమస్యలు ఉత్పన్నం కాకుండ కొలతలు పారదర్శకంగా ఉండాలని తలిపారు. మార్చి 13 నాటికి సర్వే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు 5,126 మందికి సంబంధించి 6,227 ఎకరాలు భూములు రీసర్వే చేయటం జరుగుతుందని తెలిపారు. ఏపీజీ బ్యాంకు సేవలు సక్రమంగా లేవని, రుణాలు మంజూరు చేయటం లేదని, గ్రామంలో జాతీయ బ్యాంకు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రోడ్డులో గుంతలు ఉండటంతో మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. రైతులు పొగాకు పంటలో వచ్చే మల్లె వలన ఉత్పత్తులు తగ్గటమే కాకుండ ధరలు అనుకూలంగా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం అందించారు. టుబాకో బోర్డు, ఐటీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. వారితో పాటు ఆర్డీఓ గ్లోరియా, తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, సర్వేశాఖ ఏడీ ప్రసాదరావు, రెవెన్యూ, సచివాలయ అధికారులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

అద్దంకి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - అద్దంకి : స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సైన్స్ అధ్యాపకులు సైన్స్ దినోత్సవ ప్రాధాన్యత గురించి వివరించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎంవి సత్యనారాయణ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని భార్గవి హై స్కూల్‌లో శుక్రవారం జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేటువంటి విధంగా భార్గవి యాజమాన్యం విద్యార్థుల చేత ప్రాజెక్టులను చిన్న వయసులోనే తయారు చేయించటం అభినందనీయమన్నారు. అనంతరం ప్రాజెక్టులను తయారు చేయడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ కరస్పాండెంట్ పివి సురేష్ ప్రిన్సిపాల్ లక్ష్మి,సైన్స్ ఉపాధ్యాయులు పి.వేణు,లత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,సాహితి,కుమారి, సునీత,రిజ్వానా, దివ్య, ప్రసన్న,చక్రవర్తి,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రపంచ టైలర్స్ డే వేడుకలను శుక్రవారం నిజాంపట్నంలోని మెయిన్ బజార్‌లో నిజాంపట్నం టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హెరీవే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు.అనంతరం నిజాంపట్నం టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ బొమ్మిడి గాంధీ మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హెరీవే జన్మదినంను పురస్కరించుకుని ఫిబ్రవరి 28న ప్రపంచ టైలర్స్ డేను టైలర్స్ జరుపుకుంటారని చెప్పారు.మనుషుల అందాన్ని రెట్టింపు చేసే విధంగా దుస్తులను కుట్టేది ఒక దర్జీ మాత్రమేనని చెప్పారు.వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా దుస్తులను కుట్టడం ఒక మంచి కళ అని ఆయన కొనియాడారు. సెక్రటరీ చింత నాగరాజు,వైస్ ప్రెసిడెంట్ షేక్ అన్సారీ,వైస్ సెక్రటరీ బొమ్మిడి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మిడి సుబ్బారావు, రేపల్లె నియోజకవర్గ టైలర్స్ ఇన్‌ఛార్జి సిహెచ్ సుబ్రహ్మణ్యం,టైలర్స్ చిప్పల జగన్ మోహన్ రావు,ఫారూక్ జానీ,కరిముల్లా,ఖాదర్ బాషా, మహిళా టైలర్స్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-కొండపి : మండలంలోని కే ఉప్పలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుసన్నకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సైన్స్ దినోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - యద్దనపూడి : రీ సర్వేను పకడ్బందీగా పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని,రైతులతో సామరస్యంగా ఉండి,వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలని, తప్పులు లేకుండా రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికా రులకు తెలియజేశారు. పలువురు రైతులు భూ సమస్యలను ఆర్డిఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిఐఓఎస్ శ్రీనివాసరావు, తహశీల్దారు రవికుమార్,రీ సర్వే డీటీ విష్ణు ప్రసాద్,ఆర్ఐ సత్యనారాయణ,వీఆర్వో వసంతరావు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుగుణరావుకు ఘన సత్కారం

విశాలాంధ్ర - అద్దంకి : గత 31 సంవత్సరాలుగా గ్రంధాలయాలలో పని చేసి ప్రస్తుతం అద్దంకి గ్రంథపాలకుడిగా విధులు నిర్వహిస్తున్న గ్రంధ పాలకుడు చుండూరి సుగుణరావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో స్థానిక శాఖ గ్రంధాలయంలో సుగుణరావుకు పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, పట్టణ ప్రజా సంఘాల నాయకులు,సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై వివోఏలకు శిక్షణ

విశాలాంధ్ర - అద్దంకి : విజన్ బిల్డింగ్‌పై స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 42 గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. స్వయం సహాయక సంఘాలు రాబోవు ఐదు సంవత్సరాలలో ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధి చెందాలో ఏఏ మార్గాలు అనుసరిస్తే సంఘాల బలోపేతం అవుతాయో ఏపీఎం కోటేశ్వరరావు విఓఏలకు అవగాహన కల్పించారు. ప్రతి గ్రూపు అభివృద్ధి వైపు నడవాలంటే పొదుపు లోన్లు సక్రమంగా చెల్లించి సబ్సిడీతో కూడిన రుణాలను ఉపయోగించుకొని ఆదాయ మార్గాలను అనుసరిస్తే అభివృద్ధివైపు పయనిస్తారని ఏపీఎం కోటేశ్వరరావు వివోఏలకు సూచించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - పర్చూరు : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశువర్దన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తెలిపారు. పర్చూరు మండలాల్లోని పశు పోషకులు ఈ కాలంలో పశువుల్లో సాధారణంగా వచ్చే గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమంలో మార్చి ఒకటో తేదీ నుండి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని పశు పోషకలకు సూచించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో భాగంగా చిన్నారులు తయారు చేసిన ప్రాజెక్టులు పలువుర్ని ఆకట్టుకున్నాయి ఈప్రాజెక్టులు తయారు చేయడం ద్వార చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలిగి తీసి వారి మెదడుకు మరింత పదును పెట్టేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు ఈసందర్భంగా చిన్నారులు ప్రయోగించిన సైన్స్ ప్రాజెక్టులను వివిదపాఠశాలల విద్యార్ధినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు అనంతరం ఎంపికైన ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందచేసారు మద్దిరాలపాడు లోని శ్రీసూర్య విద్యానికేతన్ లో చిన్నారి హేమంత్ శ్రీకార్తికేయ ప్రదర్శించిన వృదాగా పోతున్న నీటిని వినియోగించుకొనే విదానం తెలిపే నమూన ఆకట్టుకుంది అదేవిదంగా ఉప్పుగుండూరు సరస్వతి హైస్కూల్ లో సైన్స్ పేర్ డే వేడుకలు సందర్బంగా విద్యార్దినీ విద్యార్థు ప్రదర్శించిన స్వేదజలం నమూనా మూడనమ్మకాలు నమ్మవద్దు సైన్స్ ముద్దు అంటూ బాబాల పేరతో చేసే మోసాలు గాలిలో తేలే బాబా వేషదారణలో చిన్నారులు నటించిన ప్రదర్శన పలువుర్ని ఆకట్టకున్నాయి వాటితో పాటు పలు ప్రదర్శనలను సైన్స్ నమూనాలతో వివరించారు అదేవిదంగా అమ్మనబ్రోలు విజ్ఞానభారతి హైస్కూల్ లో సైన్స్ పేర్ డే వేడుకలు నిర్వహించారు ఈసందర్భంగా చిన్నారులు రక్తపరిక్షలు ద్వార రక్తవర్గాలను కనగొనే ప్రయోగం ఆకట్టుకుంది ఆ ప్రయోగాన్ని అమ్మనబ్రోలు కెనరాబ్యాంకు మేనేజరు జి ఏడుకొండలు తిలకించారు అదేవిదంగా మండలంలోని వివిద ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ పేర్ డే వేడుకలు నిర్వహించారు ఆయాకార్యక్రమాల్లో ఉప్పుగుండూరు సరస్వతి హైస్కూల్ డైరెక్టరరు ఎన్ నాగభూషణం, హెచ్ ఎం షేక్ వహీద్ , కె శ్రీనివాసరావు, మద్దిరాలపాడు శ్రీసూర్యవిద్యానికేతన్ లో ఎం ఇ ఓ రవి ,డైరెక్టరు రామాల వెంకట్రామిరెడ్డి, హెచ్ ఎం విజయలక్ష్మి, ఇన్ చార్జి కిరణ్ చంద్ర , అమ్మనబ్రోలు విజ్ఞానభారతి హైస్కూల్ డైరెక్టరు జమీర్ తదితరులు ఉన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం

- అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : అంకిత భావంతో పోలీసు శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు విశేష సేవలు అందించి శుక్రవారం పదవి విరమణ పొందుతున్నందున పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవి విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని కుటుంబంతో ప్రశాంతంగా గడపాలని,ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పదవీ విరమణ పొందినప్పటికీ మీరు పోలీస్ కుటుంబ సభ్యులేనని,ఎలాంటి సమస్య ఉన్నా,ఎప్పుడైనా తమ దృష్టికి తెస్తే పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ ముప్ప సాయిబాబా, బాపట్ల ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పాతూరి వీరస్వామిలు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు,ఏఆర్ డిఎస్పీ విజయ సారధి, బాపట్ల డిఎస్పీ రా మాంజనేయులు,ఇతర పోలీసు అధికారులు,పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గుంటూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె సబ్ జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గుంటూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ శుక్రవారం సందర్శించారు. ఖైదీల గదులను ఆయన పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన మాట్లాడుతూ సబ్ జైల్లో ఖైదీలకు గల సౌకర్యాలు,భోజన వసతులు, వారికి చట్టపరంగా గల హక్కుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని వాటి గురించి ఖైదీలకు న్యాయమూర్తి వివరించారు. 70 సంవత్సరాలు వయసు పైబడి ఉన్న ఖైదీల పేర్లు వివరాలు సబ్ జైలు అధికారిని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది గుమ్మడి కుమార్ బాబు,సబ్ జైల్ అధికారి వెంకటేశ్వరరావు,జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కర్లపాలెం : కష్టాలలో ఉన్న పేదలను ఆదుకోవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ ముందుకు వస్తుందని సభ్యుడు నందిపాటి సునీల్ శ్రీరామ్ తెలిపారు. కర్లపాలెం మండలం కట్టావాద గ్రామానికి చెందిన కొండమూది నాగరాజు ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సమయంలో అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అసోసియేషన్ సభ్యులకు తెలిపారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులకు బాధితుడికి ఆర్థిక సహాయం చేయాలని కోరగా శుక్రవారం ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు పడుతున్న పేదలకు చేదోడుగా అండగా నిలుస్తూ వారికి కొంత ధైర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి,ట్రెజరర్ జోగి సువర్ణరాజు,మద్దిబోయిన గోపి, బీమా కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎర్రం శెట్టి పవన్ పాల్గొన్నారు.

ఘనంగా దయాబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : తెలుగు దేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి తానికొండ దయబాబు జన్మదిన వేడుకలు బాపట్ల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దయాబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ నాయకులు మందపాటి ఆంద్రేయ, తెలుగుయువత బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి అడే వంశీ, ఐనంపూడి షాలెంరాజు, కాగిత నాగభూషణకుమారి, చినబాబు, బడుగు నాగేశ్వరావు, శ్యాంసుందర్, యలమంద, పరిశా రమేష్, దగ్గుమల్లి రాణి, యోహోను, ప్రసాదు, రవి తదితరులున్నారు.

సూపర్ సిక్స్ హామీలకు 'చిల్లు'

కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మండిపాటు

విశాలాంధ్ర - కనిగిరి : రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 202-2026 వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడి అని కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మరోసారి చంద్రబాబు తన మోసపూరిత నైజాన్ని చాటుకుంటూ సూపర్‌సిక్స్ హామీలకు చిల్లు పెట్టారని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని చెబుతూనే బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం అరకొరగా చేశారన్నారు. ఈ రెండు పథకాల్లోనూ భారీగా లబ్ధిదారులకు కోత పెట్ట దానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తారేమోనన్న భయంతో కంటితుడుపుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు స్పష్టమవు తోందన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందలా సాగిందని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌ను పొగడడానికే ఆయన పరిమితం అయ్యారన్నారు. అధికారం కోసం ఎన్నికల ముందు ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఏరుదాటాక తెప్ప తగలేసిన చందాన వ్యవహరిస్తున్నారని దద్దాల నారాయణ యాదవ్ మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రస్తావన చేయలేదని, బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే మరచిపోయారని మండిపడ్డారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే యోగం ఈ ఏడాది కూడా లేనట్టేనని ఎద్దేవా చేశారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం ఇస్తామని ప్రగల్భాలు పలికిన నారా చంద్రబాబు నాయుడు బడ్జెట్లో దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో లక్షలాది మంది మహిళలను బాబు ఎప్పట్లానే మోసం చేశారన్నారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగస్తులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో జగన్ కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని నమ్మించి ఓట్లేయించుకున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చివరకు మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయలేని పరిస్థితికి వచ్చారని, బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అని ఈ బడ్జెట్ తో మరోమారు రుజువైందని ఇది పేదల వ్యతిరేక బడ్జెట్ అని నారాయణ యాదవ్ అన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గుడిపాటిపల్లి గ్రామం బూతు కి సంబంధించిన తెలుగుదేశం కార్యకర్తల సభ్యత్వ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని టీడీపీ బూత్ ఇన్‌ఛార్జి గంజి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్ నందు సభ్యత కార్డుల పంపిణీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి చేతులమీదుగా ప్రతి గ్రామానికి చెందిన భూత్ ఇన్‌ఛార్జిలకు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా గుడిపాటి పల్లకి 226 టిడిపి సభ్యత్వ కార్డులు కార్యకర్తలు నమోదు చేసుకున్నారని గంజి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్డులను నమోదు చేసుకున్న కార్యకర్తలకు అందజేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ముక్కు శ్రీనివాసరెడ్డి ,జీజే శుభాకర్ (చక్రి) పాల్గొన్నారు.

జీఎంఆర్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక జీఎంఆర్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ జీవీ మల్లికార్జునరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి స్వప్న, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను వీక్షించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన మరియు పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం చే బహుమతి ప్రధానం చేయడం జరిగింది.

1 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పశువులన్నిటికీ వచ్చే నెల 1 తేదీ నుండి 30 తేదీ వరకు ఉచితంగా గాలికుంటు టీకాలు చేస్తామని శుక్రవారం పొన్నలూరు మరియు చౌటపాలెం పశువైద్యాధికారులు కోటేశ్వరరావు, జె శివరామకృష్ణులు ఒక ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుంది, చూడి పశువులు ఈసుకు పోవటం ,అలాగే పాలు తాగే దూడలలో మరణాలు కూడా సంభవిస్తాయి. పశువులకు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని మండలంలో ఉన్న పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయింపు పై హర్షం

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలోనే ముస్లింలు సంక్షేమ, సామాజిక,రాజకీయ,ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందారని, ఆ కోవలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమం కోసం రూ.5,434 కోట్లు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్‌కి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (మైనారిటీ సంక్షేమ వ్యవహారాలు) ఎం.ఏ.షరీఫ్‌కి తెదేపా మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పఠాన్. హనీఫ్ ఖాన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే గుడిపాటిపల్లికి రాక

విశాలాంధ్ర- వెలిగండ్ల : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మండలంలోని గుడిపాటి పల్లెలో పింఛన్ కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకట నలో తెలిపారు సచివాలయ పరిధిలోని ప్రజలు కార్యకర్తలు పింఛన్‌దారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ప్రజా వేదిక

విశాలాంధ్ర-వెలిగండ్ల : మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 16వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని ఏపీవో శ్రీనివాస్ నాయక్ తెలిపారు ఈ సామాజిక తనిఖీ1-04-2023 నుండి 31-03-2024 వరకు జరిగిన పనులు పురోగతిపై సామాజిక తనిఖీ బృందం ఫిబ్రవరి 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు మండలంలోని 21 పంచాయతీలో జరిగిన పనులు వివరాలను పరిశీలించి నేడు ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వర స్వామి రథోత్సవం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మహా శివరాత్రి మహోత్సవం పురస్కరించుకొని పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ రథోత్సవ కార్యక్రమాని భక్త జన సందోహం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారిని రజినీ కుమారీ, ప్రత్యేక అధికారి అనిల్ ఆధ్వర్యంలో స్వామివారి రదోత్సవం కార్యక్రమం జరిగింది. స్వామివారి సేవకులు కొండపై వున్నా ఉత్సవ మూర్తులను మేళా తాళ్లలతో తేరు వద్దకు తీసుకు వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెదేపా వై పాలెం నియోజక వర్గ ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు, ఆలయ చైర్మన్ సుబ్బారావు, అధికారులు కొబ్బరికాయ కొట్టి తేరు కదిలెందుకు జండా ఊపారు.తేరు లాగేందుకు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవం వద్ద దర్శి డియస్పి లక్ష్మి నారాయణ, అస్సాన్ ఆధ్వర్యంలో యస్ఐ శివ బసవరాజు పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్త్ నిర్వహించారు. అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్,విస్తరణ అధికారి రామసుబ్బయ్య, వైద్యాధికారి నాగేశ్వరావు నాయక్, భాస్కర్ రెడ్డి,తెలుగుదేశం నాయకులు చలమయ్య, శ్రీనివాస్ రెడ్డి, కొండల్,నాసర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 11వ వార్షికోత్సవంలో యం ఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేయడం జరిగినది. ఈ పరీక్ష అట్టలను రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ యం రోజ్ సులోచన, చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ పాఠశాల చైర్మన్ షేక్ ధీనాభి యంపిపియస్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె వరలక్ష్మి ఎ శ్రీనివాస రెడ్డి చేతులమీదుగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యం రోజ్ సులోచన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేసిన యం ఆర్ సేవా సంస్థ అధ్యక్షుడు మణికంఠ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ యం రోజ్ సులోచన చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ పాఠశాల చైర్మన్ షేక్ ధీనాభి యంపిపియస్ ప్రధానోపాధ్యాయురాలు కె వరలక్ష్మి శ్రీనివాస రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-రాచర్ల : మండల కేంద్రంలోని స్పందన విద్యాసంస్థలలో శుక్రవారం నాడు జాతీయ సైన్స్ దినోత్సవ సంధర్భంగా సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా తయారు చేసిన 35కు పైగా ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉంచి, విద్యార్థులచే వివరించడం జరిగినది. అలానే ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన "పాఠాలు చెప్పించే పోటీలలో" 650 మందికి పైగా విద్యార్థులు వారి వారి తల్లితండ్రులతో పాటు పాల్గొన్నారు. ప్రతీ విద్యార్థి ఎలాంటి భయం, బెరుకులేకుండా అద్భుత బోధన చేసి వారి తల్లితండ్రుల మరియు ఉపాధ్యాయుల మెప్పు పొందారు. అత్యుత్తమంగా పాఠాలు చెప్పిన 250 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం మెమెంటోలు ఇచ్చి అభినందించారు. ఈ సంధర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ ఇంత చిన్న వయస్సులో తమ పిల్లలు పాఠాలు చెప్పడం ఒక మరిచిపోలేని అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. స్పందన విద్యాసంస్థల విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లితండ్రులు, సిబ్బంది మరియు యాజమాన్యం పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులు,బాధ్యతలపై అవగాహన

విశాలాంధ్ర-ముండ్లమూరు : రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమానమేనని హక్కులు కల్పించినందున చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎవరినైనా చిన్నచూపు చూడరాదన్నారు. సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఎం వి ఎస్ ఆర్ మూర్తి, వీఆర్వో కే దయానందం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : అభివృద్ధి కొరకు ప్రభుత్వం నిర్దేశించిన అంశాలలో పురోగతి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.డిఆర్‌సి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంపుపై నూరు శాతం లక్ష్యాలు చేరుకుని బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.50వేల 965 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు జరుగుతుందన్నారు.46 వేల మంది రైతులు 15 రకాల ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారన్నారు. బాపట్ల జిల్లాలో అదనంగా 237 ఎకరాలలో సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు.ఆ లక్ష్యాలను చేరుకోవడంతో బాపట్ల జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. 7,700 మంది మిర్చి రైతులకు మిర్చి పంటలపై అవగాహన కల్పించి,ముందస్తు జాగ్రత్త చర్యలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు.రైతులను చైతన్య పర్చాలని ఆయన తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలన్నీ 5 స్టార్ ర్యాంకులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 1,430 పాఠశాలలు ఉండగా 18 అంశాలలో పరిమితులను ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. విద్యాబోధనతోపాటు మౌలిక సదుపాయ కల్పనలో అన్ని పాఠశాలకు 5 స్టార్ ర్యాంకింగ్ ఉండాలన్నారు. నాలుగు స్టార్ల ర్యాంకింగ్ పొందిన పాఠశాలలు జిల్లాలో 150 ఉన్నాయన్నారు. మిగిలినవి ఆ స్థాయిలోకి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు.అపార్ ఐడి నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా 14వ స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థుల నమోదు వేగంగా పెంచాలన్నారు.మాతృ మరణాల నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 2024 సంవత్సరంలో 43.14 శాతం మాతృ మరణాలు జిల్లాలో నమోదు కాగా,శిశు మరణాలు 4.31 శాతం నమోదు అయ్యాయన్నారు.మాతృ, శిశు మరణాల నివారణపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదు కాగానే తక్షణమే ఆ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు.వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే వైద్యశాలల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వైద్య సేవలు ప్రజలకు అందించాలన్నారు.డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు.కుష్టు వ్యాధి సర్వేలో 14.55 లక్షల మందిని పరిశీలించగా 12 కేసులు నమోదయ్యాయన్నారు.వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు.

ఎన్‌సిడిసి సర్వే వేగంగా చేయాలన్నారు.643 హెల్త్ పింఛన్ల విచారణ పూర్తి కాగా 340 మందికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు.దివ్యాంగుల పింఛన్ పొందేవారు 24,000 మంది ఉండగా,16 వేల మంది పింఛన్లను విచారించి ధ్రువీకరించామన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం ప్రజలకు అందేలా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ మార్గ దర్శకాలు పాటించడమే ప్రామాణికమని ఆయన వివరించారు.ఈ సమావేశంలో సిపిఓ శ్రీనివాస్,జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపివిపి కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్,ఉద్యానవనశాఖ ఏడి జెన్నమ్మ,పరిశ్రమలశాఖ జిఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.బాల్య ,కౌమార కార్మిక వ్యవస్థ చట్టం 2016 ప్రకారం 18 సంవత్సరాల వయస్సు లోపల ఉన్న బాల బాలికలు ఎవరూ కూడా పని ప్రదేశాలలో ఉండకూడదని,అలా ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై బాల కార్మిక చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.వి శివప్రసాద్,బాపట్ల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి జ్యోతి,సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు

విశాలాంధ్ర - పర్చూరు : డ్వాక్రా సంఘాల సభ్యులకు జీవనోపాదులు పెంపొందించుకొనుటకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేశారని వెలుగు ఏపిఎం రామకృష్ణ తెలిపారు.పర్చూరు మండలంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా పర్చూరు బ్రాంచ్,అన్నంబోట్లవారిపాలెం నందు డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణమేళా జరిగింది.అందులో భాగంగా పర్చూరు బ్రాంచ్‌లో రూ.60 లక్షలు బ్యాంకు లింకేజీ,జీవనోపాదులు పెంపొందించుకునేందుకు భాగంగా 10 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున 10 లక్షలు రూపాయలు చెక్కుల పంపిణీ చేసారు. అదేవిధంగా అన్నంబోట్లవారిపాలెం బ్రాంచ్ పరిధిలో ఇద్దరు సభ్యులకు టెంట్ హౌస్‌కు రూ.6,40,000లు,గొర్రెల యూనిట్‌కు రూ.3,00,000లు మంజూరు,బ్యాంకు లింకేజి ద్వారా రూ.20 లక్షలుకు మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ పర్చూరు బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్,వెలుగు ఏపిఎం రామకృష్ణ,ఫీల్డ్ ఆఫీసర్ లిజిపాన్, సీసీలు ప్రమీల,విజయ్ కుమార్,శ్రీనివాస మూర్తి,వివోఏలు ఉన్నారు.

ప్రాజెక్టులతో విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక చలపతిరావు ఎడ్యుకేషనల్ సొసైటీ రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో,నేషనల్ సైన్స్ డే సందర్భంగా సివి రామన్ స్మరణలో,సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా పాఠశాలలోని విద్యార్థిని,విద్యార్థులు ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్స్, ఎర్త్‌క్వేక్ అలారం,డిస్పెన్సర్ ఆఫ్ వాటర్,యాంటీ ఫైర్,హైడ్రాలిక్ క్రేన్,అబ్స్టాకిల్స్ ఐడెంటిఫైయింగ్ రోబోట్,ఆటోమేటెడ్ ఇరిగేషన్ సిస్టం, ఆటోమేటిక్ ఫైర్ స్టాపర్,ఆక్వా వెంచర్,హ్యూమన్ బ్రెయిన్ అండ్ హార్ట్ మోడల్స్,వాటర్ ట్యాంక్ అలారం,ఎలక్ట్రిక్ లిఫ్ట్, సోలార్ ఎనర్జీ, వంటి పలు రకాల ప్రాజెక్ట్ మోడల్స్‌ను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుర్రా అవర్ణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభ్యాసం అంటే, కేవలం తరగతి గదికి పరిమితమై వినడం,చూడడం కాకుండా,స్వయంగా చేయడం ద్వారా ఎక్కువ విషయ అవగాహన ఉంటుందన్నారు.

వైభవంగా బెక్టాగన్-2025 ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బెక్టాగన్-2025 అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ కళాశాలలో 65కి పైగా సాంకేతిక, సాంస్కృతిక సాహిత్య క్రీడా విభాగాలలో వివిధ పోటీలను జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు.దీనిలో భాగంగా శుక్రవారం జరిగిన వివిధ విభాగాలకు సంబంధించి అనేక పోటీల్లో 1200 మందికిపైగా వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.బెక్టాగన్ కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు అధ్యక్షతన ముఖ్యఅతిథి మోటుపల్లి ప్రసన్నకుమార్,గౌరవ అతిథి వడ్లమూడి శైలజ,బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు,కార్యదర్శి మానం నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి దొడ్డపనేని వెంకయ్య చౌదరి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.వివిధ కళాశాల నుంచి ఉత్సాహంతో వివిధ పోటీల్లో పాల్గొనటానికి వచ్చిన సాంకేతిక విద్యార్థులకు తమ అభినందనలు తెలిపారు.నేటి యువతకి మంచి స్ఫూర్తిని,చక్కటి మార్గ నిర్దేశాన్ని అందించగలిగే విలక్షణమైన అతిథులు రావటం ఎంతో ఆనందదాయక మన్నారు. సమష్టి సమన్వయంతో బెక్టాగన్ -2025ను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వివిధ పోటీల లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను,జ్ఞాపికలను నగదు బహుమతులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గ సభ్యులు అందజేశారు.తదనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు దొప్పలపూడి రామమోహనరావు,గెల్లి దిలీప్ కుమార్,కొల్లా వీరయ్య చౌదరి,కొమ్మినేని హరి పద్మ ప్రసాదరావు,వివిధ విభాగాల అధిపతులు,వివిధ సాంకేతిక కళాశాలల విద్యార్థులు,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని భీమవారిపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏరియా వైద్యశాల సూపర్ డెంట్ కె.సిద్ధార్థ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన అనేక ప్రాజెక్టులను, లైవ్ డెమోలను, మోడల్స్ ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషను ఆయన శుక్రవారం తిలకించారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ మాధురి, పాఠశాల ఏజీఎం అంజయ్య, రీజనల్ ఇంచార్జ్ అప్పాజీ, విజయ్ కుమార్, రవికుమార్, అనూష, వంశి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మకమైన బడ్జెట్

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : నిర్మాణాత్మ కమైన అభివృద్ధిని కాంక్షించే విధంగా ప్రభుత్వం బడ్జెట్ పెట్టిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్ జన రంజకంగా ఉందని కొనియాడారు.ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు ఈ బడ్జెట్‌లో అద్భుతంగా ఆవిష్కృతం అయ్యాయన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారని నరేంద్రవర్మ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన హర్షణీయమన్నారు.

గొలపల పద్ధతి మార్చుకో..

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ



విశాలాంధ్ర - బాపట్ల : తెలుగుదేశం పార్టీ బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పద్ధతి మార్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ హెచ్చరించారు. ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పీడీఎఫ్ నేత ఎస్. అనీల్‌కుమార్‌పై భౌతికదాడిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గొలపల ఆగడాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు రోజురోజుకు శృతిమించుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రవర్తించిన గొలపలపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.